బలగం BALAGAM TV
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ బుధవారం 13 ఆగస్టు 2025 | www.balagamtv.com | పేజీలు 4

## రాష్ట్ర అభివృద్ధి పనులపై మంత్రుల కమిటీ

- భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో ఐదుగురు మంత్రులతో ప్రత్యేక కమిటీ

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో అభివృద్ధి పనుల ఆమోదం, పర్యవేక్షణలో క్రమబద్ధత కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై భవిష్యత్తులో చేపట్టే కొత్త ప్రాజెక్టులు, కొనసాగుతున్న పనులు, మౌలిక వసతుల ప్రాజెక్టులకు మంత్రుల కమిటీ అనుమతి తప్పనిసరి కానుంది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన ఐదుగురు మంత్రులతో ప్రత్యేక కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రోడ్లు-భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క సభ్యులుగా ఉన్నారు.

రాష్ట్రంలోని అభివృద్ధి పనుల మంజూర్లు, పెట్టుబడులు, మౌలిక వసతుల కల్పనపై సమగ్ర పర్యవేక్షణ ఈ కమిటీ భుజాన ఉంటుంది. ఇకపై ఏ పనికైనా ఈ కమిటీ ఆమోదం లేకుండా అమలు చేయరాదని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

# అసలు సినిమా ముందుంది

- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో




కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎలక్షన్ కమిషన్ (ఈసీ)పై తీవ్ర విమర్శలు చేశారు. 'ఒక మనిషి, ఒక ఓటు' సూత్రాన్ని అమలు చేయాల్సిన ఈసీ, తన విధిని నిర్వర్తించడం లేదని ఆరోపించారు. ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయన్నారు. 'అసలు సినిమా ముందుంది' అని వ్యాఖ్యానించారు. పార్లమెంట్ భవనం బయట మాట్లాడిన రాహుల్ గాంధీ, ఈసీపై కీలక కామెంట్స్ చేశారు.

కర్ణాటక, మహారాష్ట్రలో గత ఏడాది జరిగిన ఎన్నికల్లో ఓటర్ మోసాలకు ఎన్నికల సంఘం పాల్పడిందని, ఇప్పుడు అదే పద్ధతిని బీహార్‌లో అమలు చేయడానికి సిద్ధమవుతోందని తీవ్ర విమర్శలు చేశారు. "ఒకటి రెండు స్థానాల్లో మాత్రమే కాదు... చాలా సీట్లలో ఇది జరిగింది. ఇది జాతీయ స్థాయిలో వ్యవస్థపూర్వకంగా జరుగుతోంది. ఎన్నికల సంఘానికి ఇది తెలుసు. ఇంతకుముందు సాక్ష్యం లేదు. ఇప్పుడు ఉంది" అని అన్నారు. "మేము రాజ్యాంగాన్ని రక్షిస్తున్నాం... కానీ ఎన్నికల సంఘం 'ఒకరికి ఒక ఓటు' అనే బాధ్యతను నిర్వర్తించడం లేదు. ఇంకా పిక్చర్ బాకీ ఉంది" అని వ్యాఖ్యానించారు.

"బిహార్‌లో ఎలక్షన్ కమిషన్ రూపొందించిన ఓటర్ల జాబితాలో 124 ఏళ్ల మింటా దేవీ ఉన్నారు. పైగా ఆమెకు మొదటిసారి ఓటు హక్కు కల్పించారు. ఇలాంటి కేసులు అపరిమితంగా ఉన్నాయి. ఇక్కడితో ఆగలేదు అసలు సినిమా ముందుంది(అబీ పిక్చర్ బాకీ హై)" అని రాహుల్ గాంధీ అన్నారు.

ఎలక్షన్ కమిషన్ బిహార్‌లో ఎస్ఐఆర్ చేపట్టడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు మంగళవారం నుంచి విచారణను ప్రారంభించింది. ఈ సందర్భంగా ఆర్‌జేడీ నేత మనోజ్ ఝా తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్- జస్టిస్ సూర్యకాంత్, జోయ్‌మాల్య బాగ్చిల ధర్మాసనం ముందు వాదనలు వినిపించారు. "బిహార్‌లోని ఒక నియోజకవర్గంలో 12 మంది చనిపోయారని పేర్కొంటూ ఈసీ వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించింది. కానీ ఆ 12 మంది సజీవంగా ఉన్నట్లు తేలింది. మరొక సందర్భంలోనూ సజీవంగా ఉన్న వ్యక్తులను చనిపోయినట్లు ప్రకటించారు" అని కపిల్ సిబల్ వాదించారు.

ఈసీ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేది, "ఎస్ఐఆర్ లాంటివి చేసేటప్పుడు కొన్ని పొరపాట్లు జరుగుతాయి. చనిపోయిన వ్యక్తులను సజీవంగా ఉన్నట్లు, లేదా సజీవంగా ఉన్న వ్యక్తులు చనిపోయినట్లు ప్రకటించబడవచ్చు. అయితే వీటిని కచ్చితంగా సరిదిద్దవచ్చు. ఎందుకంటే ఇది కేవలం ఒక ముసాయిదా జాబితా మాత్రమే" అని అన్నారు. దీనిపై స్పందించిన ధర్మాసనం, 'వాస్తవ గణాంకాలతో సిద్ధంగా ఉండండి' అని ఎలక్షన్ కమిషన్?కు సూచించింది.

# మూడు రోజులు భారీ వర్షాలు

- రెడ్, ఆరెంజ్, ఎల్లో హెచ్చరికలు
- లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

నేటి నుంచి రాబోయే మూడు రోజులు హైదరాబాద్ నగరం, శివారు ప్రాంతాల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. మేడ్చల్ జిల్లా, సైబరాబాద్ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో 10-15 సెం.మీ.లు, మరికొన్ని ప్రాంతాల్లో 20 సెం.మీ.ల వరకు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు.అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావొద్దని, వాహనాలు రోడ్లపైకి తీయవద్దని సూచించారు.

**రెడ్ అలర్ట్‌తో ఐదు జిల్లాలు**

బుధవారం యాదాద్రి భువనగిరి, మహబూబాబాద్, హనుమకొండ, జనగామ, వరంగల్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని రెడ్ అలర్ట్ జారీ చేసింది. పెద్దపల్లి, కరీంనగర్, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, సిద్దిపేట, మేడ్చల్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశాయి.

**జిల్లాల వారీ వర్షపాతం**

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశంతో బుధవారం నుంచి నాలుగు రోజులపాటు ఉత్తర తెలంగాణతో పాటు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించింది. సోమవారం నల్గొండ జిల్లా గుర్రంపోడు మండలంలో 6.6 సెం.మీ., గుడిపల్లి మండలంలో 6.5 సెం.మీ., రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం తాళ్లపల్లిలో 6.4 సెం.మీ. వర్షపాతం నమోదైంది.

**లోతట్టు ప్రాంతాలకు సూచనలు**

వరంగల్, హనుమకొండ, కాజీపేటల్లో కురిసిన భారీ వర్షంతో బస్టాండ్, చౌరస్తా, ఇతర లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచింది. కాజీపేట, హసన్‌పర్తి, రెడ్డిపురం, గోకుల్ నగర్, అంబేడ్కర్ నగర్, న్యూ శాయంపేట ప్రాంతాల్లో వరద నీరు నిలవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రదేశాలకు తరలించుకోవాలని అధికారులు సూచించారు.

# సిట్‌కు సృష్టి కేసు బదిలీ




నార్త్ జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్

బలగం టీవీ, హైదరాబాద్

రెండు తెలుగు రాష్ట్రాలల్లో సంచలనం రేపిన సృష్టి ఫెర్టిలిటీ కేసును సిట్‌కు బదిలీ చేసినట్టు నార్త్‌జోన్ డీసీపీ రష్మీపెరుమాళ్ తెలిపారు. మంగళవారం నార్త్‌జోన్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ వివరాలను వెల్లడించారు. పలువురి బాధితుల ఫిర్యాదు మేరకు జులైలో సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌పై కేసునమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్టు తెలిపారు. ఈ కేసులో ఇప్పటి వరకు మొత్తం 25 మందిని అరెస్ట్ చేశామని, 9 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామన్నారు. అరెస్టయిన వారిలో సికింద్రాబాద్ బ్రాంచ్, విశాఖ బ్రాంచ్‌కు చెందిన నిందితులున్నట్టు తెలిపారు. సికింద్రాబాద్‌లోని సృష్టి సెంటర్‌కు ఎలాంటి అనుమతులు లేకుండా నడిపిస్తున్నారని, పిల్లల పేరుతో చాలా మంది దంపతుల వద్ద రూ. 20 నుంచి 30 లక్షలను వసూళ్లు చేశారన్నారు. డాక్టర్ నమ్రత బ్యాంక్ ఖాతాను నిలిపివేశామన్నారు. గైనకాలజీ డాక్టర్ సూరి శ్రీమతి పేరుపై ఉన్న లైసెన్స్ నెంబర్, లెటర్ హెడ్స్‌తో ఆక్రమాలు చేశారన్నారు. 'డీఎన్ఏ' టెస్ట్ మ్యాచ్ కాలేదని మరో ఫిర్యాదు వచ్చిందని, డాక్టర్ సూరీష్, లెటర్ పాడ్ తీసుకొని మోసం చేసినట్టు ఫిర్యాదు చేశారన్నారు. విశాఖపట్నంలో విద్యులతోపాటు డాక్టర్స్ ఉష, రవిలను అరెస్ట్ చేశామని తెలిపారు. సరోగసి పేరుతో చాలా మంది వద్ద డబ్బులు తీసుకున్నారని, ఆడపిల్లలకు రూ. 3 లక్షలు, మగ పిల్లలకు రూ. 4 లక్షలు ఎజెంట్స్‌కు ఇచ్చారన్నారు. హైదరాబాద్‌కు వచ్చిన బాధితులకు విశాఖపట్నంకు పిలిపించి అక్కడే పిల్లలను ఇస్తామని నమ్మించేవారన్నారు. నిందితుల్లో చాలా మంది మహిళలు ఉన్నారని డీసీపీ తెలిపారు. సృష్టి కేసు నమోదు తర్వాత చాలా మంది బాధితులు మమ్మల్ని కలిసి వివరాలను వెల్లడించారన్నారు. 'ఐవీఎఫ్' కోసం వచ్చిన వాళ్లను సరోగసి వైపు నమ్రత మళ్లించిందన్నారు. ఒక జంటకు సరోగసి పేరుతో డబ్బులు తీసుకుని, చనిపోయిన శిశువును ఇచ్చారన్నారు. మళ్ళీ ప్రాసెస్ కోసం మరో రూ. 15 లక్షలు అవుతాయని చెప్పారన్నారు. ఈ బాధితులు సైతం ఫిర్యాదు చేశారన్నారు. మరో దంపతులకు వేరే వారి పిల్లలను ఇప్పించారని, అయితే డీఎన్ఏ మ్యాచ్ కాలేదన్నారు. సికింద్రాబాద్‌లో ఉన్న హాస్పిటల్‌ను కేవలం కన్సల్టెన్సీగా వాడుతున్నారని, ఇక్కడ 'ఐవీఎఫ్' పేరుతో శాంపిల్స్ తీసుకుంటున్నారన్నారు. సరోగసి మిగతా ప్రాసెస్ అంతా వైజాగ్‌లో చేస్తున్నారని తెలిపారు.

మహిళా నిందితుల్లో చాలామంది అండాలు అమ్ముకున్న వారున్నారని డీసీపీ తెలిపారు. సరోగసి తల్లులుగా నటించిన వాళ్ళు ఉన్నారన్నారు. సరోగసి కోసం ఎవరైనా దంపతులు సంప్రదించగానే, వాళ్లకు కొన్నిరోజుల తర్వాత ఒక ఫేక్ అల్ట్రా స్కాన్ రిపోర్ట్ పంపేవారన్నారు. సరోగసి పద్ధతిలో మీకు పుట్టబోయే పాప స్కానింగ్ రిపోర్ట్ అని నమ్మించే వారన్నారు. అదే సమయంలో నమ్రత ఏజెంట్లు ఓ గర్భిణిని వెతికిపెడతారని, 9 నెలల తర్వాత వైజాగ్‌లో డెలివరీ చేసి, ఆ శిశువును సరోగసి ద్వారా పుట్టిన పాపగా నమ్మించి దంపతులకు అప్పగిస్తారన్నారు. ఈ కేసును సిట్‌కు బదిలీ చేసినట్టు తెలిపారు. అదనపు ఎస్పీ స్థాయి అధికారిచేత ప్రత్యేక బృందం దర్యాప్తు చేస్తుందని వివరించారు.

## శంషాబాద్ ఎయిర్‌పోర్టులో గంజాయి పట్టివేత

బలగం టీవీ, హైదరాబాద్

శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో 13.3 కేజీల గంజాయిని అధికారులు పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎయిర్‌పోర్టులో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు తనిఖీలు చేయగా.. మంగళవారం ఓ మహిళ వద్ద గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆర్‌జీఐఏ అవుట్ పోస్ట్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి బ్యాంకాక్ నుంచి వచ్చిన భారతీయ ప్రయాణికురాలిని డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ), హైదరాబాద్ జోన్ యూనిట్ అధికారులు అడ్డుకున్నారు. చెక్ ఇన్ బ్యాగేజీలో భాగంగా ప్రయాణికురాలి బ్యాగ్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అందులో ఆకుపచ్చ ముద్ద పదార్థాన్ని కలిగి ఉన్న 20 ప్యాకెట్లు గుర్తించారు. వెంటనే వాటిని స్వాధీనం చేసుకుని క్షేత్ర పరీక్ష చేయగా.. అది గంజాయి అని తేలింది. దాదాపు 13.3 కిలోలు ఉన్న ఆ పదార్థం మార్కెట్లో సుమారు రూ.13.3 కోట్ల విలువ ఉంటుందని అధికారుల అంచనా. మహిళ వెంట తీసుకువచ్చిన ప్యాకేజింగ్ మెటీరియల్‌తో పాటు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఆమెని నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోఫిక్ సబ్‌స్టాన్సెస్ (ఎన్‌డీపీఎస్) చట్టం 1985 నిబంధన కింద అరెస్టు చేసి, జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# సర్వసన్నద్ధంగా ఉండాలి

- రాబోయే 72 గంటల్లో రాష్ట్రవ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు
- అప్రమత్తంగా ఉండాలి
- ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బందికి సెలవులు రద్దు
- అవసరమైతే విద్యాలయాలకు సెలవులు
- ఐటీ ఉద్యోగులు వర్క్ ఫ్రమ్ హోంకే ప్రాధాన్యత ఇవ్వాలి
- అన్నిశాఖలు సమన్వయంగా పనిచేయాలి
- కలెక్టర్లతో వీడియా కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రానున్న మూడు రోజులు తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో అధికార యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్‌తో పాటు భారీ వర్షాలు, వరద ప్రభావం ఎక్కువగా ఉండే జిల్లాల్లో ఆస్తి, ప్రాణ నష్టం జరక్కుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులు, జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు.

రానున్న 72 గంటల్లో పలు జిల్లాలతో పాటు హైదరాబాద్‌లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ముఖ్యమంత్రి గారు ఉన్నతాధికారులు, జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి అప్రమత్తం చేశారు. రానున్న పరిస్థితులను ఎదుర్కొనడానికి తీసుకోవలసిన చర్యలపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

రాబోయే మూడు రోజులు కీలకంగా మారినందున అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సెలవులను రద్దు చేయాలి. 24 గంటలు అందుబాటులో ఉండాలి. ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం జరకుండా, పశు సంపదకు నష్టం జరక్కుండా చర్యలు తీసుకోవాలి. 24 గంటల్లో 2 సెం.మీ వర్షాన్ని తట్టుకునే విధంగా పట్టణాలు నిర్మితమై ఉన్నాయి. అలాంటిది క్లౌడ్ బరస్ట్ సమయాల్లో అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అందరూ సన్నద్ధంగా ఉండాలి. గతంలో 2 గంటల్లో 42 సెం.మీ వర్షం పడటంతో నష్టం జరిగింది.విపత్తు నివారణ నిధులను వినియోగించుకోవాలి. నిధులకు కొరత లేదు. గ్రేటర్ హైదరాబాద్, గ్రామీణ ప్రాంతాల కోసం టోల్ ఫ్రీ హెల్ప్ లైన్స్ ఏర్పాటు చేయాలి. సమాచారం ఎప్పటికప్పుడు కమాండ్ కంట్రోల్ రూంకు చేరుకునేలా ఏర్పాట్లు చేయాలి.

హైదరాబాద్‌తో పాటు వరద ప్రభావం ఎక్కువగా ఉండే జిల్లాల్లో ముందస్తు చర్యలు తీసుకోవాలి. నగరంలోని మూడు కమిషనరేట్ల పరిధిలో ట్రాఫిక్ నియంత్రణకు సివిల్ పోలీసుల సేవలను వినియోగించుకోవాలి. పాఠశాలలు, కాలేజీలు నడపాలా, సెలవు ప్రకటించాలా అన్నది స్థానిక పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలి. హైదరాబాద్, రంగారెడ్డి లాంటి ప్రాంతాల్లో ఐటీ సంస్థలు వర్క్ ఫ్రమ్ హోం నిర్వహించుకునేలా ఆయా సంస్థలతో ఐటీ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ గారు సమన్వయం చేయాలి. వీలైనంత వరకు ప్రజలను రోడ్లపైకి రాకుండా అప్రమత్తం చేయాలి. హైడ్రా తరపున ఎఫ్ఎం రేడియోల ద్వారా, టీవీల ద్వారా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలి. ప్రజలను ఆందోళనకు గురిచేసే సమాచారం ఇచ్చే సంస్థలకు వెనువెంటనే వాస్తవాలను వెల్లడించాలి.

నగరంలో శిథిలావస్థలో ఉన్న భవనాలున్నాయి. జోనల్ కమిషనర్లను అప్రమత్తమై అలాంటి చోట ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. భారీ వర్షాలతో ఆకస్మిక వరదలు సంభవించినప్పుడు ఎయిర్ లిఫ్టింగ్ చేసేందుకు అవసరమైన హెలికాప్టర్స్ ఉండేలా చూసుకోవాలి. ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బందితో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలి. హైడ్రా 24 గంటలపాటు అప్రమత్తంగా ఉండాలి. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ విభాగంలో 2 వేల మందికి శిక్షణ ఇచ్చాం. సహాయక చర్యల కోసం ఎక్కడ అవసరమైతే వారిని అక్కడికి తరలించాలి. విద్యుత్ అంతరాయం ఏర్పడితే తక్షణం పునరుద్ధరణ పనులు చేపట్టాలి. మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్స్, అవసరమైతే జనరేటర్స్‌ను సమకూర్చాలి. విద్యుత్‌కు సంబంధించి అత్యవసర సమయాల్లో ఉపయోగించుకునేందుకు వీలుగా మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్స్ అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా, అలాగే పట్టణాల్లో డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.వైద్య మిగితా 2వ పేజీలో

## ఎకో టూరిజం విస్తరణపై దృష్టి సారించాలి

- వన్యప్రాణుల కదలికలు కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం
- అటవీ, రెవెన్యూ భూముల హద్దులు నిర్ధారించాలి
- అటవీ శాఖ సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

వివరాలు 2వ పేజీలో

# బండి సంజయ్‌కు కేటీఆర్ లీగల్ నోటీస్



- ఫోన్ ట్యాపింగ్ వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం
- బేషరతు క్షమాపణ డిమాండ్

బలగం టీవీ, హైదరాబాద్

కేంద్ర మంత్రి బండి సంజయ్ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై చేసిన వ్యాఖ్యలు అసత్య పూరితమని, అవి తన ప్రతిష్టను దిగజార్చే ఉద్దేశంతో ఉన్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ మేరకు కేటీఆర్ న్యాయవాదులు బండి సంజయ్‌కు లీగల్ నోటీసు జారీ చేశారు.

**అసత్య ఆరోపణలు - నోటీసులో హెచ్చరిక**

కేంద్రమంత్రిగా బాధ్యతారహితంగా, రాజకీయ ప్రయోజనాల కోసం అడ్డగోలు ఆరోపణలు చేయడం దుర్మార్గమని నోటీసులో పేర్కొన్నారు. వెంటనే బేషరతు క్షమాపణ చెప్పకపోతే, చట్టపరంగా సివిల్ మరియు క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆగస్టు 8న బండి సంజయ్ నిర్వహించిన మీడియా సమావేశంలో చేసిన ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవని, ఇవి పూర్తిగా నిరాధారమైనవని న్యాయవాదులు స్పష్టం చేశారు. ప్రజల్లో కేటీఆర్ ప్రతిష్టను దెబ్బతీయాలనే ఉద్దేశంతోనే ఈ వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు.

కేటీఆర్ తరపున న్యాయవాదులు, బండి సంజయ్ తన హోదాను దుర్వినియోగం చేసి, పదే పదే ఈ విధమైన రాజకీయ ప్రాపగాండా చేస్తున్నారని పేర్కొన్నారు. భవిష్యత్తులో కేటీఆర్ లేదా ఆయన కుటుంబంపై ఎటువంటి దురుద్దేశపూర్వక వ్యాఖ్యలు చేయకుండా ఉండాలని నోటీసులో డిమాండ్ చేశారు.

**ఏడు రోజుల్లో సమాధానం లేకపోతే చర్యలు**

నోటీసు అందిన ఏడు రోజుల్లో డిమాండ్లను పాటించకపోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ఆరోపణల వల్ల కలిగిన నష్టానికి బండి సంజయ్ బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

# ఖజానా జ్యువెలర్స్‌లో చోరీ

- వెండి వస్తువులు దోపిడీ
- అసిస్టెంట్ మేనేజర్‌పై కాల్పులు
- హైదరాబాద్ చందానగర్‌లో ఘటన

బలగం టీవీ, హైదరాబాద్




హైదరాబాద్-ముంబై జాతీయ రహదారి పక్కనున్న ఖజానా జ్యువెలరీ షాప్‌లో భారీ దోపిడీకి దుండగులు ప్రయత్నించారు. షాప్ సిబ్బందిపై కాల్పులు జరిపారు. పోలీసులు రావడంతో అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం జరిగింది. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి ఘటనా స్థలానికి చేరుకుని, దోపిడీకి యత్నించిన తీరును షో రూమ్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీసీ కెమెరాలను పరిశీలించారు. కేసుకు సంబంధించిన వివరాలను సీపీ మీడియాకు వెల్లడించారు. చందానగర్ జాతీయ రహదారి పక్కనున్న ఖజానా జ్యువెలరీ షోరూం ప్రతిరోజూ లాగానే మంగళవారం ఉదయం 10:30 గంటలకు తెరిచారు. తెరిచిన ఐదు నిమిషాల్లోనే ఆరుగురు దుండగులు లోపలికి ప్రవేశించారు. ఒక దుండగుడు షోరూమ్‌లోకి ముందే వచ్చి రెక్కీ నిర్వ హించి వెళ్లినట్టు సీసీ ఫుటేజ్‌ని బట్టి తెలుస్తోంది. లోపలికి ప్రవేశించిన దుండగులు వారి వద్ద ఉన్న గన్‌తో షోరూం సిబ్బందిని బెదిరించి కాల్పులు జరిపారు. అసిస్టెంట్ మేనేజర్ సతీష్ కాలులోకి బుల్లెట్ దూసుకెళ్లింది. దాంతో షోరూం సిబ్బంది భయపడి పరుగులు పెట్టారు. బంగారం ఉన్న అల్మార తాళం చెవి ఎక్కడని అసిస్టెంట్ మేనేజర్ సతీష్‌ను దుండగులు బెదిరించారు. ఘటనా స్థలంలో రెండు రౌండ్ల కాల్పులు జరిపారు. ఒకటి అసిస్టెంట్ మేనేజర్ సతీష్ కాలిపై, రెండవది షో రూమ్‌లో రూఫ్‌పైకి కాల్పులు జరిపారు. ఈ సమయంలోనే సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసుల రాకను గమనించిన దుండగులు అక్కడి నుంచి పారిపో యారు. నిందితులు షాప్‌లో పది నిమిషాలు మాత్రమే ఉన్నారు. వెండి వస్తువులు దోచుకెళ్లారు. బంగారు ఆభరణాలు చోరీకి గురి కాలేదు. ఎంత వెండి చోరీకి గురైంది అనేది స్పష్టత రావాల్సి ఉంది. దుండగుల వద్ద మూడు తుపాకులు ఉన్నట్టుగా షాప్ సిబ్బంది చెప్పిన వివరాలను బట్టి తెలుస్తోంది. నిందితులను పట్టుకునేందుకు పోలీసులు ఆరు ప్రత్యేక బృందా లను ఏర్పాటు చేశారు. చుట్టుపక్కల జిల్లాల పోలీసులను, టోల్ గేట్ల వద్ద కూడా ప్రత్యేక గాలింపు చర్యలు చేపట్టారు. నిందితులు ఎవరు..? ఎక్కడి నుంచి వచ్చారనే దానిపై సమగ్ర దర్యాప్తు చేస్తున్నామని సీపీ తెలిపారు.




## లాయర్ దంపతుల హత్య కేసు సీబీఐకి అప్పగింత

- సుప్రీంకోర్టు ఆదేశాలు
- రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు

బలగం టీవీ, హైదరాబాద్

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన న్యాయవాద దంపతులు గట్టు వామన్‌రావ్, నాగమణిల హత్యకేసును సుప్రీంకోర్టు సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ)కి అప్పగించింది. మంగళవారం ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. వామన్‌రావు స్వగ్రామం మంథని మండలంలోని గుంజపడుగ గ్రామం కాగా, 2017 ఫిబ్రవరి 17న రామగిరి మండలం కల్వచర్ల గ్రామ శివారులో వెళ్తున్న వారి కారును అడ్డగించి, నడిరోడ్డుపై దారుణంగా కత్తులతో పొడిచి హతమార్చిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. కేసులో పలువురిని అరెస్ట్ చేసినా, దర్యాప్తు ఇంకా కొనసాగుతుంది. ఈ కేసును సీబీఐకి అప్పగించాలని వామన్‌రావ్ తండ్రి కిషన్‌రావ్ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ ఎన్.కే. సింగ్‌ల ధర్మాసనం పిటిషన్‌పై విచారణ జరిపి, రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. హత్యకు సంబంధించిన వీడియోలు, పత్రాలు సీబీఐకి అందజేయాలని ఆదేశించింది.

సీబీఐ విచారణ అవసరమా అనే అంశంపై రికార్డులు పరిశీలించిన తర్వాత తుది నిర్ణయం తీసుకుంటామని ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే, ఈ లోపులో కేసును సీబీఐకి అప్పగించడానికి తమకు అభ్యంతరం లేదని తెలంగాణ ప్రభుత్వ తరపు న్యాయవాది తెలిపాడు. సుప్రీంకోర్టు ఆదేశాలపై స్పందించిన వామన్‌రావ్ తండ్రి కిషన్‌రావ్ - "సీబీఐ విచారణలో వాస్తవాలు వెలుగులోకి వస్తాయనే నమ్మకం ఉంది" అని అన్నారు.



## శ్రీశైలం గేట్లు ఎత్తివేత

- నాలుగు గేట్లు పది అడుగుల మేర..
- నాగార్జునసాగర్ వైపుకు 1,08,000 క్యూసెక్కుల నీటిని విడుదల

వివరాలు 2వ పేజీలో

# ఎకో టూరిజం విస్తరణపై దృష్టి సారించాలి

- వన్యప్రాణుల కదలికలు కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం
- అటవీ, రెవెన్యూ భూముల హద్దులు నిర్ధారించాలి
- అటవీ శాఖ సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి



**బలగం టీవీ, హైదరాబాద్**

అటవీ శాఖపై కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మంత్రి కొండా సురేఖతో కలిసి సీఎం సమీక్ష నిర్వహించారు. అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లున్నప్పటికీ, తెలంగాణ వాసులు బందీపూర్, తడోబా వంటి ఇతర రాష్ట్రాల పులి ప్రదేశాలను సందర్శిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక రిజర్వ్‌లలో సౌకర్యాలు పెంచి సందర్శకులను ఆకర్షించాలని ఆదేశించారు.

**అటవీ-రెవెన్యూ భూ వివాదాల పరిష్కారం**

అటవీ, రెవెన్యూ శాఖల మధ్య భూ వివాదాల పరిష్కారానికి కలెక్టర్లు సంయుక్త సర్వే నిర్వహించాలని ఆదేశించారు. వరంగల్ కాకతీయ జూ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని, ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో అభివృద్ధి చేసే అవకాశాలను పరిశీలించాలని సూచించారు.

**జంతు దాడుల్లో మృతులు, గాయపడిన వారికి పరిహారం**

అటవీ జంతువుల దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన లేదా గాయపడిన వారికి, అలాగే పశువులు, పెంపుడు జంతువులు నష్టపోయిన వారికి వెంటనే పరిహారం అందించాలి. ఇందుకు సీఎంఆర్ఎఫ్ నిధులను వినియోగించాలని సూచించారు.

అటవీ ప్రాంతాల్లో రహదారులు, ఇతర అభివృద్ధి పనులకు అనుమతుల విషయంలో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ అనుమతులను త్వరగా సాధించాలని ఆదేశించారు.

అడవుల్లో వన్యప్రాణుల కదలికలను గమనించేందుకు ఏర్పాటు చేసిన కెమెరాలను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేయాలని, ఐఎఫ్ఎస్ అధికారుల కొరత నివారణకు కేంద్రంతో చర్చించాలని సూచించారు. అటవీ శాఖలో ప్రమోషన్లు, ఉద్యోగాల భర్తీపై ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేయాలని, ఉత్తమ పనితీరు కనబరిచిన వారికి అవార్డులు ఇవ్వడం పునరుద్ధరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

## కొడంగల్‌లో ఆలయాలు అభివృద్ధి చేయాలి

**బలగం టీవీ, హైదరాబాద్**



కొడంగల్ శాసనసభ నియోజకవర్గం పరిధిలోని పలు దేవాలయాలను ఉన్నతంగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కొడంగల్‌లోని శ్రీ మహాలక్ష్మీ వెంకటేశ్వర స్వామి (బాలాజీ) ఆలయం, దౌల్తాబాద్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం, కోస్గీలోని శివాలయం, వేణుగోపాల స్వామి వారి ఆలయాలను సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా చాలా గొప్పగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. కొడంగల్ నియోజకవర్గంలోని పలు దేవాలయాల అభివృద్ధి, తీసుకోవలసిన చర్యలపై ముఖ్యమంత్రి గారు అధికారులతో సమీక్షించారు. కొడంగల్‌లోని చారిత్రక శ్రీ మహాలక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయాన్ని ఆరు ఎకరాల విస్తీర్ణంలో టీటీడీ తరహాలో అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలకు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు ఆమోదించారు. ఈ ఆలయ ఆలయ అభివృద్ధికి సంబంధించిన డిజైన్లు, ముఖ్యంగా ప్రాకార మండపం, మాడ వీధులు, భూ వరాహస్వామి దేవాలయం, గర్భగుడి, మహామండప డిజైన్లలను అధికారులు ముఖ్యమంత్రి గారికి వివరించారు. అలాగే, దౌల్తాబాద్, కోస్గి ఆలయాల అభివృద్ధికి సంబంధించిన డిజైన్లను కూడా పరిశీలించిన ముఖ్యమంత్రి గారు పలు సూచనలు చేశారు. రాతి కట్టడాలతో ఆలయాలను అద్భుతంగా అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు గారు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## శ్రీశైలం గేట్లు ఎత్తివేత

- నాలుగు గేట్లు పది అడుగుల మేర..
- నాగార్జునసాగర్ వైపునకు 1,08,000 క్యూసెక్కుల నీటిని విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

శ్రీశైలం జలాశయానికి భారీ వరద కొనసాగుతోంది. సోమవారం నాటికి నాలుగు గేట్లు పది అడుగుల మేర ఎత్తి నాగార్జునసాగర్ వైపుకు 1,08,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ జలవిద్యుత్ కేంద్రాల ద్వారా విద్యుత్ ఉత్పత్తి అనంతరం 65,000 క్యూసెక్కుల నీటిని వదులుతుండగా, మొత్తం 1,78,000 క్యూసెక్కులు నాగార్జునసాగర్ చేరుతున్నాయి.

ఎగువ జూరాల నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు 99,000 క్యూసెక్కులు, సుంకేసుల ద్వారా 52,000 క్యూసెక్కులు, హంద్రీ నది ద్వారా 5,640 క్యూసెక్కుల నీరు చేరుతోంది. జూరాల ప్రాజెక్టుకు ఎగువ నారాయణపూర్ నుంచి 1,05,000 క్యూసెక్కులు వస్తుండగా, పది గేట్లు ఎత్తి శ్రీశైలం వైపు 68,000 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. విద్యుత్ ఉత్పత్తి ద్వారా మరో 36,000 క్యూసెక్కులు వదులుతున్నారు. తుంగభద్ర నుంచి సుంకేసుల బ్యారేజీకి 60,000 క్యూసెక్కుల వరద వస్తుండడంతో 13 గేట్లు ఒక మీటర్ ఎత్తి నీటిని శ్రీశైలం వైపు మళ్లిస్తున్నారు. అధికారుల అంచనా ప్రకారం, వరద మరో వారం రోజుల పాటు ఇదే మోతాదులో కొనసాగే అవకాశం ఉంది.

## దేశంలోనే సైబర్ క్రైమ్‌లో తెలంగాణ అగ్రస్థానం

**బలగం టీవీ, హైదరాబాద్**

దేశవ్యాప్తంగా నమోదవుతున్న సైబర్ క్రైమ్ రేటుతో పోలిస్తే తెలంగాణలో దాదాపు పది రెట్లు అధికంగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. జాతీయ నేర గణాంకాల సంస్థ (ఎన్‌సిఆర్‌బి) మంగళవారం విడుదల చేసిన 2022 మధ్యంతర డేటా ఈ షాకింగ్ విషయాలను వెల్లడించింది.

**దేశ సగటుతో పోలిస్తే 10 రెట్లు అధికం**

ఎన్‌సిఆర్‌బి గణాంకాల ప్రకారం దేశవ్యాప్తంగా సైబర్ క్రైమ్ రేటు సగటున 4.8 శాతం కాగా, తెలంగాణలో ఇది 40.3 శాతంగా నమోదైంది. దీంతో ఈ జాబితాలో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది. దక్షిణాది రాష్ట్రాల్లో సైబర్ నేరగాళ్లు ఎక్కువగా క్రియాశీలంగా ఉన్నట్లు నివేదిక స్పష్టం చేస్తోంది. తెలంగాణ తర్వాత కర్ణాటక రెండో స్థానంలో నిలిచింది. మహారాష్ట్రలో సైబర్ క్రైమ్ రేటు 6.6 శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 4.4 శాతం, అసోంలో 4.9 శాతం, ఉత్తరప్రదేశ్, ఒడిశాలలో 4.3 శాతం చొప్పున ఉంది. పెద్ద రాష్ట్రాల్లో పశ్చిమ బెంగాల్ కేవలం 0.4 శాతం క్రైమ్ రేటుతో మెరుగైన స్థానంలో ఉంది.



కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఢిల్లీ 3.2 శాతం, పుదుచ్చేరి 3.9 శాతం క్రైమ్ రేటుతో సైబర్ నేరాలకు హాట్‌స్పాట్‌లుగా మారాయి. ఢిల్లీ పోలీసుల డేటా ప్రకారం 2024లో సైబర్ మోసాల ద్వారా ఢిల్లీ వాసులు రూ.817 కోట్లు నష్టపోగా, 2025లో జూన్ 30 నాటికి తొలి ఆరు నెలల్లోనే రూ.70.64 కోట్లు కోల్పోయారు.

దేశంలో సైబర్ నేరాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపడుతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ఇటీవల లోక్‌సభలో తెలిపారు. ఇందులో భాగంగా 'ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్' (%క్ష్మ4జ%) ఏర్పాటు చేశామని, ఆన్‌లైన్ ఫిర్యాదుల కోసం 'నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్' ప్రారంభించామన్నారు. అలాగే, మహిళలు, చిన్నారులపై జరిగే సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి సారించేందుకు పోలీస్ విభాగాల్లో ప్రత్యేక యూనిట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## ఉస్మానియా హాస్పిటల్ తరలింపుపై హైకోర్టు నోటీసులు

**బలగం టీవీ, హైదరాబాద్**

హైదరాబాద్: గోషామహల్ స్టేడియంకు ఉస్మానియా జనరల్ హాస్పిటల్‌ను తరలించే ప్రభుత్వ నిర్ణయంపై హైకోర్టు నోటీసులు జారీ చేసింది. రాము అనే వ్యక్తి ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసి, స్టేడియంలో పాఠశాల ఉండటంతో పాటు విద్యార్థులకు చెందిన ఆటస్థలంలో హాస్పిటల్ నిర్మాణం సరికాదని వాదించారు. ప్రస్తుత మైదానం కూల్చివేత పనులు జరుగుతున్నాయని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. స్టేడియం స్థలాన్ని హాస్పిటల్‌కు బదలాయించడం ఏకపక్షమని, ఇది పట్టణాభివృద్ధి చట్టాలకు విరుద్ధమని పిటిషనర్ తరపు న్యాయవాది వాదించారు.

అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి పేదలకు వైద్య సదుపాయం అందించడానికే ఈ ప్రాజెక్టు చేపట్టినట్లు తెలిపారు. అక్కడి ప్రభుత్వ పాఠశాలలు, విద్యార్థులను ఇతర పాఠశాలల్లో సర్దుబాటు చేశామని కోర్టుకు వివరించారు. హాస్పిటల్ నిర్మాణం కోసం ఎంత స్థలం వినియోగిస్తారు, ఎంత ఖాళీ స్థలం మిగులుతుంది వంటి పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయడానికి గడువు కోరగా, కోర్టు అనుమతించింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 26కి వాయిదా వేసి, ఈ లోగా ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.

## ఓట్ల చోరీపై వినూత్న నిరసన

**బలగం టీవీ, హైదరాబాద్**

ఓట్ల చోరీ (ఓట్ల దొంగతనం)కి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు వినూత్న నిరసన చేపట్టాయి. పార్లమెంట్ ఆవరణలోని మకర్ ద్వార్ వద్ద మంగళవారం ప్రతిపక్ష ఎంపీలు ఆందోళన చేపట్టారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత కోసం డిమాండ్ చేశారు. బీజేపీ పిరికిచర్య.. నియంతృత్వం.. మా గళాన్ని ఆపలేదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, ప్రజల ఓటు హక్కు కోసం తాము పోరాడుతామని నినదించారు. ఇటీవల బీహార్‌లో విడుదలైన ఓటరు ముసాయిదా జాబితాలో మింతా దేవి(124) మహిళను గుర్తించడంపై టి షర్టులు ధరించి ఎంపీలు ఆందోళన చేపట్టారు. మింతా దేవి ఫొటో ఉన్న టీ షర్టులు, వాటిపై 124 నాటౌట్ అని రాసి ఉన్న వాటిని ధరించి నిరసనలో పాల్గొన్నారు. నినాదాల హోరెత్తించారు. అంతేకాక ఈ అంశాన్ని సీరియస్‌గా ప్రజల ముందుకు తీసుకొచ్చారు. ఈ టీ-షర్టులు కేవలం నిరసన సాధనాలు మాత్రమే కావని, ఈ సమస్య తీవ్రత గురించి చెప్పడమే తమ ఉద్దేశమని అన్నారు. పార్లమెంటు ఆవరణలో జరిగిన ఈ ఆందోళనలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీనియర్ నేత సోనియా గాంధీ, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా, టీఎంసీ ఎంపీ డెరెక్ ఓ బ్రెయిన్, డీఎంకే ఎంపీలు టిఆర్ బాలు, తిరుచ్చి శివ, కనిమొళి, ఎన్‌సీపీ నేత సుప్రియా సులే, సీపీఐ(ఎం) ఎంపీలు జాన్ బ్రిట్టాస్, అమ్రారామ్, రాధాకృష్ణన్, శివదాసన్, ఎస్. వెంకటేషన్, ఎఎ రహీమ్, సీపీఐ ఎంపీ సంతోష్ కుమార్, ఎస్పీ ఎంపీ రాంగోపాల్ యాదవ్, ఆర్జేడీ ఎంపీ మనోజ్ కుమార్ ఝా, జేఎంఎం ఎంపీ మహువా మాంఝీ, శివసేన ఎంపీ అరవింద్ సావంత్ తదితరులు ఆందోళనలో పాల్గొన్నారు. మరోవైపు పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రతిపక్షాల ఆందోళన కొనసాగింది. దీంతో పార్లమెంట్ ఉభయ సభలు వాయిదాల పర్వం తొక్కాయి.

## సర్వసన్నద్ధంగా ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

వైద్య ఆరోగ్య శాఖ ద్వారా అత్యవసర సమయాల్లో అవసరమైన మెడిసిన్స్, సౌకర్యాలను అన్నింటినీ సిద్ధం చేసుకోవాలి. ఏ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిందో ఆ ప్రాంతాల్లో సమన్వయం కోసం కలెక్టర్లు అదనంగా అధికారులను నియమించుకోవాలి. గ్రేటర్ హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ కమిషనరేట్ల పరిధిలో మూసీ పరివాహక ప్రాంతంతో పాటు ప్రమాద స్థాయికి నీరు చేరుకునే ప్రాంతాలకు ప్రజలను వెళ్లనీయకుండా పోలీసులు నియంత్రించాలి.

ప్రాజెక్టులు, చెరువులు, కుంటల్లోకి ఇన్‌ఫ్లో, ఔట్ ఫ్లోపై నీటి పారుదల శాఖ అధికారులు పూర్తి అవగాహనతో ఉండాలి. లోతట్టు ప్రాంతాల ప్రజలకు నీటి విడుదలపై పూర్తి సమాచారం ఇవ్వాలి. చెరువులు, కుంటలు కట్టలు తెగే ప్రమాదం ఉన్నందున ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. మా శాఖకు సంబంధం లేదని ఏ విభాగం చెప్పడానికి వీలులేదు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి.ప్రస్తుత

పరిస్థితులను ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవడానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గారు ప్రత్యేకంగా ఒక గ్రూప్ ను క్రియేట్ చేసుకుని సమన్వయం చేసుకోవాలి. అవసరమైతే కొందరు సీనియర్ ఆఫీసర్లను డిప్యూట్ చేసుకోవాలి.వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారు, తుమ్మల నాగేశ్వర రావు గారు, పొన్నం ప్రభాకర్ గారు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు గారు, డీజీపీ జితేందర్ గారితో పాటు ఆయా శాఖల ఉన్నతాధికారులు, జిల్లాల నుంచి కలెక్టర్లు పాల్గొన్నారు.

## తెలంగాణ చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్‌గా నందకుమార్ నియామకం

**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తెలంగాణ చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ (విద్యుత్తు ప్రధాన భద్రతాధికారి)గా కే నందకుమార్‌ను నియమించింది. ఇంధనశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ మంగళవారం ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం నందకుమార్ టీజీఎస్పీడీసీఎల్‌లో చీఫ్ ఇంజినీర్ (ప్రాజెక్ట్స్)గా పనిచేస్తున్నారు.

ఇటీవలే ప్రారంభమైన యాదాద్రి పవర్ ప్లాంట్ యూనిట్-1 చార్జింగ్‌కు సీఈఐజీ అనుమతులు అవసరం. కొత్త బాధ్యతలు స్వీకరించిన నందకుమార్ బుధవారం వైటీపీఎస్‌లో తనిఖీలు నిర్వహించనున్నారు.

ఆంధ్రా ప్రాంతానికి చెందిన నందకుమార్‌ను కీలక పదవికి నియమించడంపై తెలంగాణవాదులు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. "ఇందుకోసమేనా తెలంగాణను తెచ్చుకున్నది?" అని వారు ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి ఆంధ్రా వారికి కీలక హోదాలు ఇవ్వడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# వేములవాడ నియోజకవర్గ సాగునీటి ప్రాజెక్టులపై సమీక్ష..



- సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష చేసిన రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- పాల్గొన్న నీటిపారుదల శాఖ అధికారులు

**బలగం టీవీ, హైదరాబాద్**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గ పరిధిలో కొనసాగుతున్న సాగునీటి ప్రాజెక్టుల ప్రగతిని సమీక్షిస్తూ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హైదరాబాద్‌లో నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు, పలు ఏజెన్సీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలికోట సూరమ్మ చెరువు రిజర్వాయర్ కలికోట నుండి కుడి ఎడమ కాల్వల నిర్మాణ పనులు, మల్కాపేట రిజర్వాయర్ ఎడమ కాలువ కోసం భూ సేకరణ, వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లి ప్రాజెక్టు పనులు, కోనరావుపేట మండల పరిధిలోని లచ్చాపేట తండా రిజర్వాయర్ కాలువ పనులు, చందుర్తి మండల పరిధిలోని ఆశిరెడ్డిపల్లి కొచ్చెరువు, సనుగుల ఎర్ర చెరువు పటేల్ చెరువులోకి నిటితో నింపే ఏర్పాట్లు తదితరాంశాలపై చర్చించారు.

ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని, రైతులకు సాగునీరు సకాలంలో అందించేందుకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సూచించారు. ప్రాజెక్టుల నిర్మాణ పనుల పురోగతిని సమీక్షిస్తూ, ఎలాంటి ఆలస్యం లేకుండా నాణ్యతతో పనులు పూర్తి చేయాలన్నారు.

అలాగే రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టుల అమలులో పారదర్శకత పాటించడంతోపాటు, వ్యవసాయ ఉత్పాదకత పెరగడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. ఈ సందర్భంగా అధికారుల నుండి ప్రాజెక్టుల ప్రస్తుత స్థితిగతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో సీఈ సుధాకర్ రెడ్డి, ఈఈ సంతు ప్రకాష్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.




# బీసీలకు 42% రిజర్వేషన్ చట్టబద్ధంగా అమలు చేయాలి..

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

బీసీ వర్గాలకు హామీ ఇచ్చిన 42 శాతం రిజర్వేషన్‌ను చట్టబద్ధంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని బీసీ నేత కంచర్ల రవి గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కంచర్ల రవి గౌడ్ మాట్లాడుతూ, "కామారెడ్డి బహిరంగ సభలో అప్పటి పిసిసి అధ్యక్షుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని హామీని విస్మరించి మోసం చేస్తున్నారు" అని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ మాత్రం ఎల్లప్పుడూ బీసీల సంక్షేమం కోసం నిజాయితీగా పనిచేసిందని రవి గౌడ్ తెలిపారు. స్థానిక ఎన్నికల్లో బీసీ ఓట్లు పొందడానికే కాంగ్రెస్ పార్టీ రిజర్వేషన్ ముసుగులో కొత్త రాజకీయ ప్రయోగాలు చేస్తోందని ఆరోపించారు. "రాష్ట్రపతి ఆమోదం కోసం అని తప్పించుకుంటూ%ౕ% సీఎం రేవంత్ రెడ్డి 50 సార్లు ఢిల్లీకి వెళ్లి ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదు" అని ఎద్దేవా చేశారు. "మేము బీసీలం భిక్షగాళ్లం కాదు, మా వాటా మాకు కావాలి" అని స్పష్టం చేసిన రవి గౌడ్, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ విద్య, ఉద్యోగ రంగాల్లో కూడా వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు బీసీల రిజర్వేషన్ అమలయ్యాకే జరగాలని ప్రధానంగా కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వడ్లూరి సాయి సూర్య, ముద్దం అనిల్ గౌడ్, ఎస్.కె. అప్రోచ్, కోడం వెంకటేశం, వడ్లూరి వేణు, జుమీర్, హరీష్, అమ్ము తదితరులు పాల్గొన్నారు.

# యూరియా కొరత తీర్చాలి

- పోలీస్ పహారాలో యూరియా పంపిణీ చేయడం పాలకుల చేతకానితనానికి నిదర్శనం..
- జిల్లా కలెక్టర్ స్పందించకపోవడం బాధాకరం..
- రాజన్న సిరిసిల్ల జిల్లా మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు
- ఇల్లంతకుంటలో బీఆర్ఎస్ ధర్నా..

**బలగం టీవీ, ఇల్లంతకుంట**

ఎద్దు ఏడ్చిన ఎవుసం రైతు కన్నీరుపెట్టిన రాజ్యం నిలువదని రైతు రాజ్యం తీసుకొస్తామని ఎన్నికల్లో దొంగ హామీలిచ్చి అడ్డదారిలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను కన్నీరు పెట్టిస్తోందని జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు సిద్ధం వేణు అన్నారు. రైతులకు యూరియా సరఫరా చేయాలని ఇల్లంతకుంట మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో రోడ్డుపై బీఆర్ఎస్ నాయకులు ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిద్ధం వేణు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20నెలలు అవుతుందని ఇప్పటి వరకు రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని ప్రభుత్వం పూర్తి చేయలేదని విమర్శించారు. రైతుబంధు ఇవ్వక రైతులను ఆగం చేశారని,రైతుభీమా ప్రీమియం కూడా చెల్లించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు.

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి కోటి ఎకరాలకు సాగునీళ్లు ఇస్తే ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును పడావుబెట్టి రైతులకు సాగునీళ్లివ్వడం లేదని విమర్శించారు. జిల్లాలో ఇంత జరుగుతున్నా జిల్లా కలెక్టర్ ఏం చేస్తున్నారని, కనీసం ఎక్కడ కూడా కలెక్టర్ రైతుల సమస్యలు అడిగి తెలుసుకోవడం లేదన్నారు. జిల్లాలో విజిలెన్స్ అధికారులు మొద్దునిద్ర పోతున్నారని, డీసీఎంఎస్ ,ఆగ్రోస్ నిర్వాహకులు, ప్రయివేట్ వ్యాపారులు యూరియా బస్తాతో పాటు



ఇతర మందులు అంటగట్టి రైతులను నిండా ముంచుతున్నారని, విజిలెన్స్ అధికారులు ఎందుకు పట్టించుకోకుండా ఉన్నారని దుయ్యబట్టారు. స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మీకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా కూడా రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయించాలని డిమాండ్ చేశారు. రైతు ప్రభుత్వం అని చెప్పుకోవడమే కాదు. రైతులకు సరిపడా ఎరువులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల రైతుబంధు సమితి మాజీ అధ్యక్షులు చెరుకుపల్లి రాజిరెడ్డి పార్టీ సీనియర్ నాయకులు ఒగ్గు నర్సయ్య, సర్పంచ్ ల ఫోరమ్ మాజీ ఉపాధ్యక్షులు, అనంతారం మాజీ సర్పంచ్ బొల్లం వెంకటేశం, వల్లంపట్ల మాజీ సర్పంచ్ %ఎజఅ% రెడ్డి, రహీంఖాన్ పేట మాజీ సర్పంచ్ లు కముటము రాములు, బిళ్ళవేని పరశురాములు, వెల్జిపూర్ మాజీ సర్పంచ్ ఉడతల వెంకన్న, వొల్లాల రవీందర్ గౌడ్, కేశవేణి శ్రీనివాస్ యాదవ్, పట్నం శ్రీనివాస్, కూనబోయిన రఘు, ఆకుల శ్రీనివాస్,సిద్ధం నరసయ్య, భాస్కర్ రెడ్డి, ఎడ్ల ప్రశాంత్ రెడ్డి, అంతగిరి భాస్కర్, మహేందర్,రవీందర్ రెడ్డి, నరసయ్య, పిల్లి వేణు,గుంటి మధు, బుర్ర బాలకిషన్, దయ్యాల మహేష్ ఎండి సమీర్, గొడుగు హరికుమార్,, మీసం శ్రీనివాస్ యాదవ్, కుంభం రాజు, రాజేందర్, రంగు నరేష్ గౌడ్, పండుగు అర్జున్, పండుగ వేణు తదితరులు పాల్గొన్నారు.



# గంగాధర క్షేత్రంలో సామూహిక కుంకుమ పూజలు..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

ఇల్లంతకుంట మండల కేంద్రంలోని శ్రీ గంగాధర క్షేత్రంలో శ్రావణమాసం పురస్కరించుకొని మంగళవారం అమ్మవారికి గాజుల అలంకరణ చేశారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి, ప్రసాదాల వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు, ప్రముఖ పురోహితులు శ్రీ మూగు నాగరాజు శర్మ, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# మౌలిక సదుపాయాలు కల్పించాలి



- లేకుంటే ఆందోళనలు..
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముశం రమేష్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

సిరిసిల్ల పట్టణంలోని 21వ వార్డు గణేష్ నగర్ లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఈరోజు మున్సిపల్ కమిషనర్ కి వినతి పత్రం సమర్పించారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించకపోతే పాదయాత్రలు, నిరాహార దీక్షలు చేపడతామని సీపీఎం జిల్లా కార్యదర్శి ముశం రమేష్ హెచ్చరించారు.

ఈ సందర్భంగా ముశం రమేష్ మాట్లాడుతూ.. సిరిసిల్ల పట్టణ శివారులో ఉన్న గణేష్ నగర్ అభివృద్ధి విషయంలో ఎమ్మెల్యే కేటీఆర్, మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. కేటీఆర్ నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటికీ, గణేష్ నగర్ లో మాత్రం సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం జరగలేదని అన్నారు. కాలనీ ఏర్పడి 30 సంవత్సరాలు అవుతున్నా ఇప్పటికీ రోడ్లు, మురికి కాలువలు నిర్మించకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి చెందుతూ మున్సిపల్ కు అధిక ఆదాయం తెచ్చిపెడుతున్నప్పటికీ, ఈ ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.వర్షాలు వస్తే రోడ్లు నడవడానికి వీలు లేకుండా తయారవుతున్నాయని, మురికి కాలువలు లేకపోవడంతో ఇళ్ల ముందు మురికి నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోందని రమేష్ వివరించారు. దీనివల్ల దోమలు పెరిగి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. వీధిలైట్లు సరిగా లేకపోవడంతో పాములు, తేళ్ల భయంతో రాత్రిపూట ప్రజలు బయటకు రావడానికి భయపడుతున్నారని చెప్పారు. ఈ సమస్యలను ప్రజాప్రతినిధుల, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని ఆరోపించారు. వెంటనే గణేష్ నగర్ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టి, నిధులు కేటాయించి రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని రమేష్ డిమాండ్ చేశారు. లేని పక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో పాదయాత్రలు, నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జవ్వాజి విమల, నాయకులు నక్క దేవదాస్, గణేష్ నగర్ 21 వార్డు నాయకులు గాజుల రాజు, గాజుల ఉమాపతి, గాజుల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ముదిరాజ్ పౌరుల సమితి ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడిగా కర్నాల అనిల్ కుమార్..



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

తెలంగాణ ముదిరాజ్ పౌరుల సమితి ఉద్యోగుల విభాగం రాష్ట్ర అధ్యక్షులుగా రాజన్న సిరిసిల్ల వాసి కర్నాల అనిల్ కుమార్ ముదిరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ ముదిరాజ్ పౌరుల సమితి రాష్ట్ర అధ్యక్షులు సుంకర బోయిన మహేష్ ముదిరాజ్ మరియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పరవేణి రంజిత్ ముదిరాజ్ లు నియమించడం జరిగింది. ఈ నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు మహేష్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రంజిత్, నీల మధు ముదిరాజ్ లకి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పండుగ స్వామి ముదిరాజ్, శ్రీధర్ ముదిరాజ్, రాకేష్ ముదిరాజ్, నరేష్ ముదిరాజ్, సాయి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# చీకాగోలో తెలంగాణ విద్యార్థిని మృతి



**బలగం టీవీ, మేడ్చల్**

అమెరికాలోని చికాగోలో తెలంగాణ విద్యార్థిని రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా వెనక నుంచి ట్రక్కు ఢీకొనడంతో విద్యార్థిని ఘటనా స్థలంలో చనిపోయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మునిసిపల్ పరిధిలోని బాలాజీ నగర్ ప్రాంతం గండి మైసమ్మలో శ్రీను రావు అనే వ్యక్తి నివసిస్తున్నాడు. శ్రీను పెద్ద కుమార్తె శ్రీజ వర్మ (23) ఉన్నత చదువు కోసం అమెరికాకు వెళ్ళింది. చికాగోలో అద్దెకు రూమ్ తీసుకొని ఎంఎస్ చదువుతోంది. శ్రీజ రాత్రి భోజనం చేసిన నడుచుకుంటూ అపార్ట్ మెంట్ పక్కన ఉన్న రెస్టారెంట్ కి వెళ్తుండగా వెనకాల నుండి ట్రక్కు ఢీకొనడంతో ఆమె ఘటనా స్థలంలోనే దుర్మరణం చెందింది. కేసు నమోదు చేసి న్యూయార్క్ లోని ఎంబిసి అధికారులకు సమాచారం ఇచ్చారు.

# ‘కూలీ’, ‘వార్-2’ బుకింగ్స్ ప్రారంభం




### ఏపీ లో టికెట్ ధరల పెంపు

బలగం టీవీ, హైదరాబాద్

ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ప్రేక్షకులకు ద్విగుణానందం కలిగించబోతున్నాయి రెండు భారీ చిత్రాలు. సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన ‘కూలీ’ , ఎన్టీఆర్-హృతిక్ రోషన్ కాంబినేషన్‌లో వస్తున్న ‘వార్-2’ సినిమాలు ఆగస్టు 14న విడుదల కానున్నాయి. ఈ రెండు చిత్రాలపై ఇప్పటికే తారాస్థాయిలో అంచనాలు ఉండగా, తెలుగు రాష్ట్రాల్లో బుకింగ్స్ ప్రారంభమయ్యాయి. బుక్ మై షో, డిస్ట్రిక్ట్ యాప్‌ల ద్వారా టికెట్లు అందుబాటులో ఉన్నాయి.

తెలంగాణలో టికెట్ ధరల పెంపు లేకుండానే విడుదల కాబోతున్నాయి. సింగిల్ స్క్రీన్‌లలో రూ.175, మల్టీప్లెక్స్‌లలో రూ.295కే టికెట్లు లభించనున్నాయి. అలాగే ఉదయం 6-7 గంటల మధ్య స్పెషల్ షోలకు అనుమతి లభించింది.

మరోవైపు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాత్రం టికెట్ ధరల పెంపుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సింగిల్ స్క్రీన్‌లలో రూ.75 (జీఎస్టీతో కలిపి), మల్టీప్లెక్స్‌లలో రూ.100 (జీఎస్టీతో కలిపి) అదనంగా వసూలు చేసుకోవచ్చు. ఆగస్టు 14 నుంచి 23 వరకు ఈ పెంపు అమల్లో ఉంటుంది. కూలీ సినిమా విడుదల రోజున అదనపు షో ప్రదర్శనకు కూడా ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.



## ‘సతీలీలావతి’ నుంచి చిత్తూరు పిల్ల సాంగ్ విడుదల

బలగం టీవీ, హైదరాబాద్

టాలీవుడ్ భామ లావణ్య త్రిపాఠి టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం సతీలీలావతి నుండి తాజా అప్‌డేట్ వచ్చింది. తాతినేని సత్య దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా నుంచి ‘చిత్తూరు పిల్ల’ లిరికల్ వీడియో సాంగ్‌ను మంగళవారం మేకర్స్ విడుదల చేశారు. పెళ్లికూతురిలా లావణ్య త్రిపాఠి పాడుకుంటూ కనిపించే ఈ పాట మూవీ లవర్స్‌లో ఆసక్తిని పెంచుతోంది. వనమాలి రాసిన ఈ పాటను మిక్కీ జే మేయర్ స్వరపరిచారు. నూతన మోహన్, కృష్ణ తేజస్వి, రితేశ్ జీ రావు గానం చేశారు. గ్లామరస్ లుక్‌తో లావణ్య త్రిపాఠి అభిమానులను అలరిస్తోంది. సతీలీలావతి చిత్రాన్ని దుర్గాదేవి పిక్చర్స్, ట్రియో స్టూడియోస్ సంయుక్తంగా నాగమోహన్ బాబు ఎం, రాజేష్ టి నిర్మిస్తున్నారు. మిక్కీ జే మేయర్ సంగీతం అందిస్తున్నారు.




## ఓటీటీలోకి ‘వర్జిన్ బాయ్స్’ సినిమా

బలగం టీవీ, హైదరాబాద్

మిత్రశర్మ, గీతానంద్, శ్రీహాన్, జన్నీఫర్ ఇమ్మాన్యుల్, రోనిత్, అన్షుల ప్రధాన పాత్రల్లో రూపొందిన ‘వర్జిన్ బాయ్స్’ చిత్రం ఈ జూలై 11న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. దయానంద్ గడ్డం దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని రాజా దారపునేని నిర్మించారు.సినిమాపై ఆసక్తి రేపేందుకు ప్రమోషన్ కార్యక్రమాలు జోరుగా నిర్వహించారు. హైదరాబాద్‌లో జరిగిన ట్రైలర్ లాంచ్ వేడుకలో, టికెట్ కొనుగోలు చేసిన 11 మందికి ఐఫోన్లు బహుమతిగా ఇస్తామని చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా నిర్మాత రాజా దారపునేని, “కథకు ‘వర్జిన్ బాయ్స్’ అనే టైటిల్ సరిగ్గా సరిపోతుంది. సినిమాలో ఎన్నో సర్‌ప్రైజులు ఉన్నాయి” అని చెప్పారు. దర్శకుడు దయానంద్ గడ్డం, “తమ కాలేజ్ జీవితంలో ఎదురైన సంఘటనల ఆధారంగా కథ రూపొందించాం. ఇలాంటి సినిమాలు అరుదుగా వస్తాయి” అన్నారు. నెటిజన్లలో భారీ అంచనాలు రేపిన ఈ చిత్రం, ఆగస్టు 15 నుంచి ‘ఆహా’ ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది.

## ‘పరమ్ సుందరి’ ట్రైలర్ రిలీజ్

బలగం టీవీ, హైదరాబాద్

బాలీవుడ్ యువ నటులు జాన్వీ కపూర్, సిద్ధార్థ్ మల్హోత్రా జంటగా నటిస్తున్న తాజా చిత్రం ‘పరమ్ సుందరి’ ఆగష్టు 29న ప్రేక్షకుల ముందుకు రానుంది. తుషార్ జలోటా దర్శకత్వంలో, మ్యాడాక్ ఫిల్మ్స్ బ్యానర్‌పై దినేశ్ విజన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ నేపథ్యంలో మేకర్స్ తాజాగా ట్రైలర్‌ను విడుదల చేశారు. పంజాబీ, మలయాళీ ప్రేమకథ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమా ట్రైలర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. జాన్వీ, సిద్ధార్థ్‌ల కెమిస్ట్రీ హైలైట్‌గా కనిపించగా, అందమైన విజువల్స్, మ్యూజిక్ ఆకర్షణీయంగా ఉన్నాయి.

ఈ చిత్రంలో సంజయ్ కపూర్, మంజ్యోత్ సింగ్, రెంజి పనీకర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ట్రైలర్‌తో సినిమాపై




## డొక్కా సీతమ్మ జీవితంపై రెండు సినిమాలు

- ‘ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ’ పేరుతో చిత్రం
- అన్నపూర్ణ తల్లి బువ్వమ్మ’ పేరుతో సినిమా

బలగం టీవీ, హైదరాబాద్

భూమి, ధనం అన్నీ త్యాగం చేసి ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టిన మహనీయురాలు డొక్కా సీతమ్మ పేరు ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకానికి పెట్టింది. ఈ నిర్ణయంతో సీతమ్మ ఔదార్యం మరోసారి ప్రజల దృష్టిని ఆకర్షించింది. ఇప్పుడు ఆమె జీవితం ఆధారంగా ఒకటి కాదు రెండు సినిమాలు తెరపైకి రానున్నాయి.‘ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ’ పేరుతో ఓ చిత్రాన్ని నటి ఆమని ప్రధాన పాత్రలో తెరకెక్కిస్తున్నారు. పవన్ కళ్యాణ్ మాటలతో ప్రేరణ పొంది ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్టు మేకర్స్ తెలిపారు. సినిమా ద్వారా వచ్చే లాభాలను డొక్కా సీతమ్మ పథకానికి విరాళంగా ఇస్తామని ప్రకటించారు. ఈ సినిమాకు టి. వి. రవి నారాయణ్ దర్శకత్వం వహించగా, వల్లూరి రాంబాబు నిర్మిస్తున్నారు.

మరోవైపు, నిర్మాతలు సిరాజ్, ఖాదర్ గోరి ‘అన్నపూర్ణ తల్లి బువ్వమ్మ’ పేరుతో ఓ సినిమాను పూర్తి చేశారు. ఈ చిత్రానికి సురేశ్ లంకలపల్లి దర్శకత్వం వహించారు. సముద్ర, శివిక, కుసుమ, సుప్రియ, నవీన్ మట్టా, రోహిల్, ఆదిల్, రూపేష్ తదితరులు ఇందులో కీలక పాత్రల్లో నటించారు. షఉటింగ్ ముగింపు సందర్భంగా బాలినేని శ్రీనివాసరెడ్డి చిత్రబృందానికి షీల్డ్స్ అందజేశారు. ఈ సందర్భంగా నటి శివిక “డొక్కా సీతమ్మ పాత్ర పోషించడం గర్వంగా ఉంది” అని చెప్పగా, దర్శకుడు వి. సముద్ర “సీతమ్మ భర్త పాత్రలో నటించడం ప్రత్యేక అనుభూతి” అని అన్నారు. నిర్మాతలు త్వరలోనే పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి చేసి సినిమాను విడుదల చేయనున్నట్లు తెలిపారు.



# రెండో టీ20లో సౌతాఫ్రికా గెలుపు

### బ్రెవిస్ విధ్వంసకర శతకంతో ఆస్ట్రేలియాపై 53 పరుగుల తేడాతో విజయం

బలగం టీవీ, హైదరాబాద్

ఆస్ట్రేలియా పర్యటనలో సౌతాఫ్రికా తొలి విజయాన్ని నమోదు చేసింది. మూడు టీ20ల సిరీస్‌లో భాగంగా మంగళవారం జరిగిన రెండో మ్యాచ్‌లో ఆతిథ్య ఆస్ట్రేలియాపై 53 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. జూనియర్ ఏబీడీగా పేరుగాంచిన డెవాల్డ్ బ్రెవిస్ అజేయ శతకంతో మెరిపించగా, ఈ విజయంతో సిరీస్ 1-1తో సమం అయింది. నిర్ణయాత్మక మూడో టీ20 శనివారం జరగనుంది.

ముందుగా బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 218 పరుగుల భారీ స్కోర్ చేసింది. బ్రెవిస్ 56 బంతుల్లో 12 ఫోర్లు, 8 సిక్స్‌లతో 125 నాటౌట్ చేసి చరిత్ర సృష్టించాడు. ట్రిస్టన్ స్టబ్స్ 22 బంతుల్లో 31 పరుగులతో తోడ్పడ్డాడు. ఆస్ట్రేలియా బౌలర్లలో గ్లేన్ మ్యాక్స్‌వెల్ (2/44), బెన్ ద్వార్షుయిస్ (2/24) మెరుగైన ప్రదర్శన కనబరిచారు. లక్ష్య ఛేదనలో ఆస్ట్రేలియా 17.4 ఓవర్లలో 165 పరుగులకే ఆలౌటైంది. టీమ్ డెవిడ్ 24 బంతుల్లో 50 పరుగులతో ఆకట్టుకున్నా, మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. కెప్టెన్ మిచెల్ మార్ష్ (22), అలెక్స్ క్యారీ (26) మాత్రమే కొంత ప్రతిఘటన చూపారు. సౌతాఫ్రికా బౌలర్లలో క్వేనా మఫకా (3/57), కోర్బిన్ బోచ్ (3/20) చెరో మూడువికెట్లు పడగొట్టగా, మార్క్‌రమ్, రబడా చెరో వికెట్ తీశారు.



## అండర్సన్-సచిన్ ట్రోఫీకి రికార్డు స్థాయి ప్రేక్షకాదరణ

### ఓవల్ టెస్ట్‌కు టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే అత్యధిక వ్యూస్

బలగం టీవీ, హైదరాబాద్

భారత్-ఇంగ్లండ్ మధ్య ఐదు టెస్ట్‌ల అండర్సన్-సచిన్ ట్రోఫీ సరికొత్త చరిత్ర సృష్టించింది. ఇంగ్లండ్ వేదికగా జరిగిన ఈ సిరీస్‌కు అనూహ్య రీతిలో ప్రేక్షకాదరణ లభించింది. డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా అత్యధిక మంది వీక్షించిన సుదీర్ఘ ఫార్మాట్ సిరీస్‌గా ఇది టెస్ట్ క్రికెట్ 148 ఏళ్ల చరిత్రలో మొదటిసారిగా నిలిచింది.ఓవల్ వేదికగా జరిగిన ఆఖరి టెస్ట్ ఆల్‌టైమ్ రికార్డులు నెలకొల్పింది. ఆఖరి రోజు ఆటను జియో హాట్‌స్టార్‌లో ఏకంగా 1.3 కోట్ల మంది ప్రత్యక్షంగా వీక్షించారు. టెస్ట్ మ్యాచ్‌కు ఇంత పెద్ద స్థాయిలో కంకరెన్సీ వ్యూస్ రావడం ఇదే తొలిసారి.

ఐదు టెస్ట్‌ల సిరీస్‌లో ఇరు జట్లు హెూరాహెూరీ పోటీపడంతో 2-2తో సమంగా ముగిసింది. ప్రతి మ్యాచ్ ఆఖరి రోజు వరకు ఉత్కంఠను రేపింది. తొలి టెస్ట్‌లో 371 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన ఇంగ్లండ్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించగా, రెండో టెస్ట్‌లో 608 పరుగుల భారీ లక్ష్యాన్ని నమోదు చేసిన భారత్ 336 పరుగుల తేడాతో గెలుపొందింది. లార్డ్స్‌లో జరిగిన మూడో టెస్ట్‌ను ఇంగ్లండ్ 22 పరుగుల తేడాతో గెలుచుకుంది. 193 పరుగుల ఛేదనలో చివరి వికెట్‌గా సిరాజ్ ఔటవ్వడంతో భారత్ ఓటమి చవిచూసింది. నాలుగో టెస్ట్ డ్రాగా ముగిసింది. జడేజా, సుందర్ అద్భుత ప్రదర్శనతో భారత్‌ను కాపాడారు. ఆఖరి టెస్ట్‌లో సిరాజ్ అద్భుత బౌలింగ్‌తో ఇంగ్లండ్‌ను ఆలౌట్ చేస్తూ టీమిండియాకు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. చివరి రోజు ఆటలో నెలకొన్న ఉత్కంఠ టీ20 మ్యాచ్‌లను తలపించడంతో ప్రేక్షకులు రికార్డు స్థాయిలో వీక్షించారు.

## ఆగస్టు 27న సుందరకాండ’ రిలీజ్

బలగం టీవీ, హైదరాబాద్




హీరో నారా రోహిత్ కెరీర్‌లో మైల్‌స్టోన్‌గా నిలిచే 20వ చిత్రం ‘సుందరకాండ’ ఈ నెల 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. నూతన దర్శకుడు వెంకటేష్ నిమ్మలపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను సందీప్ పిక్చర్ ప్యాలెస్ బ్యానర్‌పై సంతోష్ చిన్నపొల్ల, గౌతమ్ రెడ్డి, రాకేష్ మహంకాళి నిర్మిస్తున్నారు. తాజాగా రెబల్ స్టార్ ప్రభాస్ ఈ చిత్ర ర్యాప్ ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ట్రైలర్ హిలేరియస్ ఫన్‌తో అలరిస్తూ, నారా రోహిత్ కామెడీ టైమింగ్‌ను మరింత హైలైట్ చేసింది. ఆయనతో పాటు నరేశ్, సత్య, వీటీవీ గణేష్, అభినవ్ గోమటం తెరపై పుష్కల ఎంటర్‌టైన్‌మెంట్ పండించారు. ట్రైలర్ మొత్తం కడుపుబ్బ నవ్వించే సన్నివేశాలతో నిండిపోగా, సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.